సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 15 । మే । 2023



అరచేతిలో తాళపత్ర నిధి
తాళపత్రాలను ఏయూ డిజిటల్ రూపంలోకి మార్పు చేసి.. ఇటీవల జన బాహుళ్యంలోకి తీసుకువచ్చింది.
8లో



గురువర్యా.. శిక్షణకు రండి..!
వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేశారు.
10లో



మేధో సంపత్తి.. మన హక్కు
మన మేధస్సు నుంచి ఆవిష్కరించిన ఆలోచన, ఉత్పత్తులకు సంబంధించిన హక్కులను మనం పొందే అవకాశం ఉంది.
10లో

న్యూస్‌రీల్

మానసిక ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా రామిరెడ్డి



మహారాణిపేట: ప్రభుత్వ మానసిక వైద్యశాల ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ కారెడ్డి వెంకటరామిరెడ్డిని నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన సోమవారం ఉదయం 10 గంటలకు పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎస్.హరికృష్ణ వ్యవహరించారు. ప్రకాశం జిల్లా గిద్దలూరు ప్రాంతానికి చెందిన డాక్టర్ వెంకటరామిరెడ్డి ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్, ఎండీ పూర్తి చేశారు. 1998 నుంచి 2002 వరకు సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా, 2002 నుంచి 2005 వరకు పోస్టుగాడ్యుయేట్‌గా, 2005 నుంచి 2011 వరకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, 2011 నుంచి 2017 వరకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2017 నుంచి ప్రొఫెసర్‌గా, 2023 నుంచి సైకాలజీ విభాగాధిపతిగా పనిచేస్తున్నారు.

నీట్ పీజీ ఫలితాల్లో పుష్పకు 166వ ర్యాంకు


పుష్పకు స్వీటు తినిపిస్తున్న ఆమె తల్లి నాగ ఆదిలక్ష్మి, తండ్రి సన్యాసిరావు

ఉక్కునగరం: నీట్ పీజీ ఫలితాల్లో ఉక్కునగరం చైతన్య కళాశాల విద్యార్థిని చదరం పుష్పకు జాతీయ స్థాయిలో 166వ ర్యాంకు లభించింది. గాజువాక హిమాచల్‌నగర్‌కు చెందిన పైప్ ఫిట్టర్ చదరం సన్యాసిరావు, నాగ ఆదిలక్ష్మిల కుమార్తె పుష్ప ఇంటర్ తర్వాత ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసింది. ఇటీవల జరిగిన నీట్ పీజీ పరీక్షలో ఆమెకు ఓపెన్ కేటగిరీలో 166వ ర్యాంకు, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్ కంబైన్డ్ ఎంట్రన్స్ టెస్ట్ (ఐఎన్ఐసెట్)లో 178వ ర్యాంకు లభించింది. ఎండీ జనరల్ మెడిసిన్ చేయడం లక్ష్యమని పుష్ప తెలిపారు. ఆదివారం చైతన్య కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమెను ఏజీఎం రమణ, డీన్లు అభినందించారు.

కిరండూల్ లైన్‌లో పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: భద్రతా కారణాల వల్ల కొత్తవలస–కిరండూల్ లైన్‌లో నడిచే పలు రైళ్ల గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. విశాఖలో సోమవారం రాత్రి బయలుదేరే విశాఖపట్నం– కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. ఈనెల 15న కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ నుంచి బయల్దేరుతుంది. విశాఖలో ఈనెల 15న బయల్దేరే విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్‌లో ఈ నెల 15, 16వ తేదీల్లో బయల్దేరాల్సిన కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ రైలు దంతేవాడ నుంచి బయల్దేరుతుంది.

రాయ్‌పూర్ పాసింజర్ రద్దు, బిలాస్‌పూర్ దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: సంబల్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న బ్రిడ్జి పునర్నిర్మాణ పనుల నిమిత్తం ట్రాఫిక్ కమ్ పవర్ బ్లాక్ తీసుకుంటున్నందున ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు, మరికొన్ని దారి మళ్లిస్తున్నటు వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ఈ నెల 15న విశాఖపట్నం–రాయ్‌పూర్–విశాఖపట్నం(08527/08528) పాసింజర్ స్పెషల్ ఇరువైపులా రద్దు చేశారు. ఆదివారం తిరుపతిలో బయల్దేరిన తిరుపతి–బిలాస్‌పూర్(17482) ఎక్స్‌ప్రెస్ వయా టిట్లాఘడ్, సంబల్‌పూర్ మీదుగా ప్రయాణిస్తుంది.

నేడు జీవీఎంసీ స్పందన

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్న స్పందన కార్యక్రమాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఓ ప్రకటనలో కోరారు.

నేడు 'డయల్ యువర్ ఆర్డీవో'

మహారాణిపేట: విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ సోమవారం 'డయల్ యువర్ ఆర్డీవో'కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ నెల 8వ తేదీ నుంచి ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ప్రతీ సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. గాజువాక, పెదగంట్యాడ, పెందుర్తి, మహారాణిపేట, ములగాడ, గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయాల పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను 0891–2562977కు ఫోన్ చేసి ఆర్డీవోకు తెలియజేయవచ్చు.

టికెట్ చెకింగ్‌పై త్రినేత్రం

- రైల్వే బోర్డు వినూత్న ప్రయోగం
- టికెట్ కలెక్టర్లకు బాడీ కెమెరాలు
- పారదర్శకంగా తనిఖీలకు చర్యలు
- వాల్తేరు డివిజన్‌లో అమలుకు ప్రణాళికలు



బాడీ కెమెరా


రైళ్లలో టికెట్ తనిఖీ చేస్తున్న టీసీ (ఫైల్)

సాక్షి, విశాఖపట్నం: రైళ్లలో హింసాత్మక చర్యలను నిరోధించే లక్ష్యంతో రైల్వే బోర్డు వినూత్న చర్యలకు శ్రీకారం చుట్టింది. టికెట్ చెకింగ్ సమయంలో వస్తున్న ఆరోపణలు, ప్రయాణికులతో వాగ్వాదాలకు చెక్ చెప్పేలా టికెట్ కలెక్టర్లకు బాడీ కెమెరాలు ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే మధ్య రైల్వే జోన్ ప్రాంతంలో పైలట్ ప్రాజెక్ట్ అమలు చేస్తున్న నేపథ్యంలో.. మిగిలిన జోన్లకు విస్తరించేందుకు సమాలోచనలు చేస్తోంది. త్వరలోనే ఈస్ట్‌కోస్ట్ పరిధిలోని వాల్తేరు డివిజన్‌లో ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనుంది.

రైలు ప్రయాణంలో టికెట్ తనిఖీలు చేసే సమయంలో ప్రయాణికులతో సిబ్బందికి తరచూ వాగ్వాదాలు జరుగుతున్నాయి. ఇదే సమయంలో టికెట్ కలెక్టర్లపై ఫిర్యాదులు కూడా వస్తున్నాయి. వెయిటింగ్ టికెట్ తనిఖీ చేసే సమయం, ఆర్ఏసీ ఉన్న ప్రయాణికులకు బెర్త్‌లు కేటాయించే విషయంలోనూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. వీటికి పూర్తిస్థాయిలో చెక్ చెప్పాలని రైల్వే బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. టికెట్ తనిఖీ అధికారులకు బాడీ కెమెరాలు అమర్చుతోంది. పైలట్ ప్రాజెక్టుగా మూడు నెలల కిందట సెంట్రల్ రైల్వే పరిధిలో 50 మంది టికెట్ కలెక్టర్లకు బాడీ కెమెరాలు అమర్చింది. అప్పటి నుంచి ఒక్క ఫిర్యాదు గానీ, ప్రయాణికుల వాగ్వాద సంఘటనలు గానీ నమోదు కాలేదు. దీంతో మిగిలిన జోన్లలోనూ అమలు చేయాలని బోర్డు నిర్ణయించింది.

ఒక్కో కెమెరా రూ.9 వేలు..

రైల్వే నెట్‌వర్క్ పరిధిలోని అన్ని జోన్లకూ బాడీ కెమెరాలు అందించాలని రైల్వే మంత్రిత్వ శాఖ బోర్డుకు సూచించింది. ఈ నేపథ్యంలో ఈస్ట్‌కోస్ట్ జోన్ పరిధిలో బాడీ కెమెరాలు అందించనున్నారు. ఇందులో భాగంగా వాల్తేరు డివిజన్ పరిధిలో టీసీలకు వీటిని అమర్చనున్నారు. ఒక్కొక్కటి రూ.9,000 విలువైన ఈ బాడీ కెమెరాలు దాదాపు 20 గంటల ఫుటేజీని రికార్డు చేయగలవు. బాడీ కెమెరాలు టికెట్ తనిఖీ సమయంలో ఉద్యోగుల పారదర్శకతను కాపాడుకోవడంలో సహాయపడతాయి. దీంతో పాటు అక్రమ చర్యలను నిరోధించవచ్చు. ఫిర్యాదుల సందర్భంలో, టిక్కెట్ తనిఖీ సమయంలో ఏదైనా వ్యత్యాసాన్ని గుర్తించడంలో కీలక పాత్ర పోషించనున్నాయని వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులు చెబుతున్నారు. వృత్తి నైపుణ్యం పెంచడంతో పాటు సిబ్బంది రక్షణకు దోహదపడతాయని అభిప్రాయపడుతున్నారు.

● జై హనుమాన్

భక్తిశ్రద్ధలతో ఆంజనేయునికి పూజలు


మెయిన్‌రోడ్డులో పూజలందుకుంటున్న స్వామి


వెంకోజిపాలెం ఆలయంలో పూజలు

హనుమజ్జయంతి వేడుకలు జిల్లాలో ఆదివారం వైభవంగా జరిగాయి. పలు ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. తమలపాకులు, సింధూరంతో అర్చనలు చేశారు. పలు ప్రాంతాల్లో శోభయాత్ర నిర్వహించారు. జై హనుమాన్, జై శ్రీరామ్ నినాదాలతో ఆయా ప్రాంతాలు హోరెత్తాయి.


హనుమాన్‌కు పూజలు చేస్తున్న భక్తులు

కాలుష్య రహిత నగరమే లక్ష్యం


సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న మేయర్ గొలగాని హరివెంకట కుమారి

బీచ్‌రోడ్డు: కాలుష్య రహిత నగరమే లక్ష్యంగా జీవీఎంసీ పని చేస్తోందని మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ పేరుతో ఆదివారం బీచ్‌రోడ్డులో సైకిల్ ర్యాలీ జరిగింది. ఆర్.కె.బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీని మేయర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ తమ జీవన శైలిని మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్, ఇంధన వినియోగం తగ్గించడం, చెట్లు పెంచడం తదితర వాటిని అలవాటు చేసుకోవాలన్నారు. జీవీఎంసీ తరఫున సోలార్ విద్యుత్ ప్రాజెక్ట్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. నగర వ్యాప్తంగా పచ్చదనం పెంపొందించే కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్నట్లు వివరించారు. నగరాభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గృహస్థాశ్రమ వైభవం ఎంతో గొప్పది


గురజాడ కళాక్షేత్రంలో ప్రవచిస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి


ప్రవచనాలు ఆలకిస్తున్న నగర ప్రజలు

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మహారాణిపేట: 'మానవ జీవనానికి సంబంధించి సనాతన ధర్మం చెప్పిన సంస్కారాల్లో అత్యంత ప్రధానమైనది వివాహం. జన్మించిన ప్రతీ వ్యక్తి కూడా తాను గృహస్థాశ్రమంలో ప్రవేశించడం కోసం పొందాల్సిన సంస్కారం ఇది. దార్శనికులైన రుషులు ప్రత్యేక ప్రయోజనం ఆపేక్షించి దీనిని వివాహం అని పిలిచారు. వి అంటే విశిష్టమైన, వాహము అంటే పొందుట..' అని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. గురజాడ కళాక్షేత్రంలో ధర్మవర్ధిని ట్రస్ట్ ఆధ్వర్యంలో గృహస్థాశ్రమ వైభవం అనే అంశంపై ఆదివారం ఆయన ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. భారీగా హాజరైన నగర ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ.. గృహస్థాశ్రమ వైభవం ఎంతో విశేషమైనదన్నారు. గృహ స్థాశ్రమంలో ఉండే ధర్మాలను పాటించాల్సిన అవసరం ప్రతీ ఒక్కరిపై ఉందని సూచించారు. వివాహమంటే భార్యాభర్తల అన్యోన్యతకు ఆదర్శ చిహ్నమని తెలిపారు. భార్య, భర్త కలసి చిరకాలం ఆనందంగా జీవించినప్పుడే ఆ దాంపత్యానికి సార్థకత చేకూతుందన్నారు. ముందుగా ఈ కార్యక్రమాన్ని టీటీడీ పూర్వ ఈవో ఎల్.వి.సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. సీఎంఆర్ సంస్థల అధినేత మావూరి వెంకటరమణ, దేవదాయ శాఖ పూర్వ కమిషనర్ వై.వి.అనురాధ, చెరువు రామకోటయ్య, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ పాల్గొన్నారు. సోమవారం, మంగళవారం కూడా ఇదే అంశంపై ప్రవచనాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

పాకశాస్త్రంలో ప్రావీణ్యులు

- నలభీములను తీర్చిదిద్దుతున్న ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్
- 10వ తరగతి అర్హతతో మూడు కోర్సుల నిర్వహణ
- తక్కువ ఫీజులతో శిక్షణ అందిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థ
- కొనసాగుతున్న అడ్మిషన్ల ప్రక్రియ


ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్


తయారు చేసిన వంటకాలతో విద్యార్థులు, శిక్షకులు

ఆరిలోవ: వంట చేయడం గొప్ప కళ. ఆ కళను ఉపాధిగా మార్చుకుని అదిరేటి రుచులు అందించే వారే ఆధునిక నలభీములు. ఆతిథ్య రంగంలో చెఫ్‌లకు ఎప్పుడూ ఆదరణ ఉంటుంది. ప్రాంతీయ సంస్కృతికి ప్రాధాన్యమిస్తూనే ఆహారంలో ఆధునికత, కొత్త ఆవిష్కరణలతో రాణిస్తే.. కాకా హోటల్ నుంచి కార్పొరేట్ కిచెన్ వరకు విస్తృతమైన అవకాశాలు ఉంటాయి. ఈ అవకాశాలను అందుకోవాలంటే నైపుణ్యాలు తప్పనిసరి. పాకశాస్త్రంలో సిద్ధహస్తులను తయారు చేస్తున్న సంస్థలెన్నో ఉన్నా.. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే సంస్థ ఒక్కటే ఉంది. అదే విశాఖలో నిర్వహిస్తున్న ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్. ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయి. అతి తక్కువ ఫీజులతో ఆరు నెలల నుంచి ఒకటిన్నర సంవత్సరాల కాల వ్యవధి కోర్సుల్లో ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు.

విశాఖపట్నంలో 1986లో ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభించారు. జాతీయ రహదారిని ఆనుకొని విశాఖ వేలీ స్కూల్, రూరల్ తహసీల్దార్ కార్యాలయం పక్కన.. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేశారు. మొదట్లో దీన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించేవి. ప్రస్తుతం ఈ ఇన్‌స్టిట్యూట్ రాష్ట్ర ప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో నడుస్తోంది. ప్రస్తుతం ఇక్కడ ఏడాదిన్నర శిక్షణతో మూడు కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కాలంలోనే ఆరు నెలల పాటు పారిశ్రామిక శిక్షణ కూడా ఉంటుంది. ప్రాంతీయ, దేశీయ వంటకాలతో పాటు విదేశీ వంటకాలను తయారు చేయడంలో ఇక్కడ తర్ఫీదు ఇస్తున్నారు. మాంసాహారం, కూరగాయల వంటకాలతో పాటు కేక్‌లు, బన్‌లు, బిస్కెట్లు, జామ్‌లు తయారీ చేయడంలో విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందిస్తున్నారు.

విస్తృత ఉపాధి అవకాశాలు

ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం నుంచి ఇంతవరకు సుమారు 3,500 మంది ఇక్కడ శిక్షణ పొందారు. వీరిలో 85 శాతానికి పైగా ఇదే రంగంలో ఉపాధి పొందుతున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వారిలో సుమారు 300కు పైగా మహిళలు ఉండటం విశేషం. విశాఖలో డాల్ఫిన్, ద పార్కు, గ్రీన్ పార్క్, నోవాటెల్, దసపల్లా, ద గేట్ వే, తదితర స్టార్ హోటళ్లు ఉన్నాయి. వీటన్నింటిలోనూ ఇక్కడ శిక్షణ పొందిన వారు ఉద్యోగాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న టూరిజం హోటళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లు, గెస్ట్‌హౌస్‌లు, కేంద్ర ప్రభుత్వ రంగంలోని ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, రైల్వే తదితర శాఖల్లో స్థిరపడ్డారు. మరికొందరు విదేశాల్లోని హోటళ్లలో పనిచేస్తుండగా.. కొందరు స్వయంగా కేటరింగ్, ఫుడ్‌కోర్టులు నిర్వహిస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు.

ఇక్కడ అందించే కోర్సులివే..

ఆరు నెలలు, ఒకటిన్నర సంవత్సరాలు కోర్సులు అందిస్తున్నారు. ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటిసరీ, బేకరీ అండ్ కన్ఫెక్షనరీ కోర్సులు ఒకటిన్నర సంవత్సరాల కాల వ్యవధితో నిర్వహిస్తున్నారు. ఒక సంవత్సరం చదువుతో పాటు ఆరు నెలలు ఇండస్ట్రియల్ ట్రైనింగ్‌లో భాగంగా ప్రాక్టికల్స్ ఉంటాయి. ఆయా కోర్సుల్లో చేరాలనుకుంటే 10వ తరగతిలో ఉత్తీర్ణులై ఉండాలి. 2023 జూలై 1 నాటికి 25లోపు వయసు కలిగి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్ల వయసు సడలింపు ఉంది. ఆసక్తి గల వారు జూలై 25 లోపు దరఖాస్తులు చేసుకోవచ్చు.

ఆరు నెలల కోర్సు..

ఈ ఏడాది నుంచి ఆరు నెలల కాలవ్యవధితో ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ కోర్సు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. 10వ తరగతిలో ఉత్తీర్ణులై.. 18 ఏళ్ల వయసు నిండినవారు అర్హులు. జూన్ 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు ఇన్‌స్టిట్యూట్‌లో నేరుగా సంప్రదించవచ్చు. లేదా 0891–2553883, 2952083 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు.

పేద విద్యార్థులకు మంచి అవకాశం



ఈ ఏడాది నుంచి ఆరు నెలల కాల వ్యవధి కోర్సు నిర్వహిస్తున్నాం. ఇక్కడ శిక్షణ పొందిన వారిలో ఎక్కువ మంది విశాఖ, హైదరాబాద్, ముంబయి, న్యూఢిల్లీ, చెన్నై, బెంగళూరు, గోవా తదితర నగరాల్లోని స్టార్ హోటళ్లతో పాటు మలేసియా, స్కాట్‌లాండ్, లండన్ తదితర దేశాల్లో పనిచేస్తున్నారు. కొందరు సొంతంగా హోటళ్లు, కేటరింగ్ సర్వీసులు నిర్వహిస్తున్నారు. ఇంకొందరు షిప్‌లు, మిలటరీ హోటళ్లు, గురుకులాలు, ఏపీ టూరిజం హోటళ్లలో పనిచేస్తున్నారు. తక్కువ ఫీజుతో శిక్షణ పొంది జీవితంలో స్థిరపడాలనుకునే వారికి ఇదొక మంచి అవకాశం. పూర్తిస్థాయి సిబ్బంది, సౌకర్యాలు కల్పిస్తే మరింత ప్రోత్సాహకరంగా ఉంటుంది.

– రవి, ప్రిన్సిపాల్, ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్

పోలీసులకు జ్యూస్ షాప్ యజమాని టోకరా?

సుమారు కోటి రూపాయలతో పరారీ

అల్లిపురం: టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి, నగర పోలీస్ కమిషనరేట్‌కు కొద్ది దూరంలోని ఓ జ్యూస్ షాప్ యజమాని అధిక వడ్డీలు ఆశ చూపించి.. సుమారు కోటి రూపాయలతో ఉడాయించినట్లు తెలిసింది. ప్రతి రోజూ తన దుకాణానికి వచ్చి జ్యూస్ తాగుతున్న పోలీసులతో పరిచయం పెంచుకున్న షాపు యజమాని.. ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. ఇలా రూ.కోటి వరకు అప్పులు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో అతను కొన్ని రోజులుగా దుకాణం తెరవకపోవడంతో బాధిత పోలీసులు ఆదివారం ఆరా తీశారు. కుటుంబంతో సహా అతను ఉడాయించాడని తెలుసుకున్నారు. అతనిపై ఫిర్యాదు చేసేందుకు సంశయిస్తున్నారు. దీనిపై టూటౌన్ స్టేషన్‌లో వివరణ కోరగా.. ఈ ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

ఆరోగ్యశ్రీ పరిధిలో మానసిక వ్యాధులు

మహారాణిపేట: మానసిక వ్యాధులను కూడా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ పరిధిలోకి తీసుకొచ్చారు. ఇప్పటికే అనేక వ్యాధులకు ఆరోగ్యశ్రీలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. క్యాన్సర్ వంటి రోగాలను కూడా ఆరోగ్యశ్రీలో చేర్చారు. తాజాగా మానసిక వ్యాధులను కూడా ఆరోగ్యశ్రీలో చేర్చడంపై సంబంధిత రోగుల బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో మానసిక రోగులకు చికిత్స అందిస్తున్న ఏకైక ఆస్పత్రి నగరంలోనే ఉంది. 1860లో స్థాపించిన ఈ ఆస్పత్రి అంచెలంచెలుగా విస్తరించారు. 1950లో ఈ ఆస్పత్రిని ఆంధ్రా మెడికల్ కాలేజీకి అనుబంధంగా 300 పడకల బోధనాస్పత్రిగా తీర్చిదిద్దారు. ప్రతి రోజూ ఈ ఆస్పత్రికి 200 నుంచి 300 మంది వరకు రోగులు వస్తుంటారు. మన రాష్ట్రంతో పాటు ఒడిశా, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లోని పలు జిల్లాలకు చెందిన మానసిక రోగులకు ఇక్కడ సేవలందిస్తున్నారు. మానసిక వ్యాధుల చికిత్సను ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చిన నేపథ్యంలో.. రోగులకు మరింత నాణ్యమైన సేవలందనున్నాయని ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త రాజేష్‌కుమార్ తెలిపారు.

ఘనంగా క్రీస్తు రక్షకుని యాత్ర


దివ్య బలి పూజల్లో మహా శ్రేష్ఠ కార్డినల్ అంతోనిపూల, బిషప్ మల్లవరపు ప్రకాష్


ఉత్సవాల్లో పాల్గొన్న క్రైస్తవులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ రక్షణగిరి విచారణకర్త, రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ నేతృత్వంలో ఆదివారం క్రీస్తు రక్షకుని యాత్ర, రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి స్వస్థత ప్రార్థనలు, రెవరెండ్ ఫాదర్ ప్రత్తిపాటి మరియదాస్ ఇంగ్లిష్‌లో దివ్యబలి పూజలు నిర్వహించారు. సాయంత్రం విశాఖ అగ్రపీఠం, అగ్రమేత్రాసనం ఆర్చిబిషప్ రెవరెండ్ డాక్టర్ మల్లవరపు ప్రకాష్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. హైదరాబాద్ అతిమేత్రాణులు మహా శ్రేష్ఠ కార్డినల్ 'అంతోనిపూల'చే సుమారు 50 మంది ఫాదర్స్, 100 మంది మతకన్యలతో కలసి రక్షణగిరి పర్వదిన దివ్య పూజాబలిని సమర్పించారు. సెయింట్ పీటర్స్ హైస్కూల్ ముఖద్వారం వద్ద 'బాలయేసు మండపం–పునీత క్లారమ్మ స్వరూపం'తేరులను కార్డినల్ అంతోని పూల, ఆర్చిబిషప్ ప్రకాష్ ప్రారంభించారు. జ్ఞానాపురం పరిధిలోని పలు వీధుల్లో తేరులను ప్రదక్షిణం చేశారు. అనంతరం ఫాదర్లు, మతకన్యలను సన్మానించారు. కార్యక్రమంలో విచారణకర్తలు సరిసా ప్రకాష్, చిన్నబత్తిన భాగ్యయ్య, రక్షణగిరి పత్రిక సంపాదకుడు ఆదిరెడ్డి అల్బెర్ట్, ఆలిండియా కేథలిక్ యూనియన్ ప్రతినిధి బూర శేషుబాబు, పీపీసీ సభ్యులు ఆదిరెడ్డి చార్లీ, అమర్, లూర్థుమాత భజన బృందం, భక్త సంఘాల విశ్వాసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైలు నుంచి జారిపడి వ్యక్తికి తీవ్రగాయాలు

అగనంపూడి: కదులుతున్న రైలు నుంచి జారి పడి జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. దువ్వాడ–తాడి రైల్వేస్టేషన్ల మధ్యలో జరిగిన సంఘటనకు సంబంధించి దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ శాంతారామ్ తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రం, డీయో ఘర్ జిల్లా బండెర్‌బోనా గ్రామానికి చెందిన ప్రకాష్‌కుమార్ బెంగుళూరు–భువనేశ్వర్ (ఎస్ఎంవీటీ ఎక్స్‌ప్రెస్)లో ప్రయాణం చేస్తూ తాడి రైల్వేస్టేషన్ దాటిన తరువాత ఆదివారం ఉదయం 11.30 గంటల సమయంలో కాలు జారి కింద పడిపోయాడు. వెంటనే రైలును నిలిపి ఆర్పీఎఫ్ సహకారంతో క్షతగాత్రున్ని దువ్వాడ రైల్వేస్టేషన్‌కు తీసుకువచ్చి అక్కడి నుంచి అంబులెన్స్‌లో కెజీహెచ్‌కు తరలించారు. జీఆర్పీ సిబ్బంది కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌కు నార్త్ వైపు సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మృతిని ముఖం ఛిద్రం కావడంతో గుర్తించలేని విధంగా తయారైంది. అతడు వయసు 50 నుంచి 55 ఏళ్లు ఉంటుందని జీఆర్పీ పోలీసులు అంచనా వేస్తున్నారు. ఇది ప్రమాదమా లేదా ఆత్మహత్య అనేది తెలియాల్సి ఉందని తెలిపారు. తెల్లని పంచె, బూడిద రంగు తువ్వాలు మృతదేహం సమీపంలో లభ్యమయ్యాయని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 94406 27547, 98664 13487 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.



ప్రమోదంలో ప్రమాదం!

క్రేజ్‌ను కోరుకుంటున్న యువత.. ప్రమాదపుటంచుల వైపు ప్రయాణిస్తున్నారు. ముఖ్యంగా రైలు ప్రయాణాల్లో విన్యాసాలు చేస్తూ.. ఆయా కుటుంబాల్లో విషాదాలు నింపుతున్నారు. విశాఖపట్నం–కొరాపుట్ రైలు మార్గంలో వంపులు తిరిగే టన్నెల్స్ ఉన్నాయి. ఈ టన్నెల్స్ లోపల రాళ్ల పరిస్థితి ఎలా ఉంటుందో తెలియదు. కానీ యువకులు రైలు నుంచి ఇలా ప్రమాదకరంగా విన్యాసాలు చేస్తూ.. తోటి ప్రయాణికుల్లో గుబులు పుట్టిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

'కాక' నుంచి ఊరట!





మండుతున్న ఎండలు. వడగాడ్పుల ధాటికి మనుషులే మలమలా మాడిపోతున్నారు. దాహార్తితో అల్లాడిపోతున్నారు. అలాంటిది పక్షుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంటోంది. ఎక్కడ చుక్క నీరు దొరుకుతుందో చూసుకుని అక్కడికే వచ్చి వాలిపోతున్నాయి. కుళాయి నీటినో, పైపుల నుంచి వచ్చే నీటినో తాగుతూ దాహం తీర్చుకుంటున్నాయి. బుల్లయ్య కాలేజీ సమీపంలో మంచి నీటి పైపు నుంచి వస్తున్న నీటిని తాగడానికి తపించిపోతున్న కాకమ్మలే ఇవి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

అరచేతిలో తాళపత్ర నిధి



డిజిటలైజేషన్ పూర్తిచేసి భద్రపరిచిన తాళపత్రాలు

- ఒక్క క్లిక్‌తో సమస్త విజ్ఞానం మన ముందుకు..
- దశాబ్దాల నాటి తాళపత్రాలను డిజిటలైజ్ చేసిన ఏయూ
- జనబాహుళ్యంలోకి భారతీయ పురాతన సంపద

ఏయూ క్యాంపస్: దశాబ్దాల చారిత్రక సంపద అందరికీ అందుబాటులోకి వచ్చింది. తాటాకులపై రాసిన జ్ఞాన సంపదను పరిరక్షించే బాధ్యతను ఆంధ్ర విశ్వవిద్యాలయం సమర్థవంతంగా నిర్వర్తించింది. వర్సిటీ వద్ద దశాబ్దాలుగా భద్రపరిచిన లక్షలాది తాళపత్రాలను డిజిటల్ రూపంలోకి మార్పు చేసి ఇటీవల జన బాహుళ్యంలోకి తీసుకువచ్చింది. కేవలం మన కంప్యూటర్‌లో, స్మార్ట్‌ఫోన్ సహాయంతో ఒక్క క్లిక్‌తో తాళపత్రాలలో ఉన్న సమాచారాన్ని చదివే అవకాశం ఏయూ ఉచితంగా అందిస్తోంది. రండి తాళపత్రాలలో ఏముందో చదివేద్దాం..

2.58 లక్షల తాళపత్రాలు డిజిటల్ రూపం

ఏయూలో ఉన్న 1,170 తాళపత్ర గ్రంథాలలోని 2.58 లక్షల తాళపత్రాలను డిజిటలైజేషన్ చేసే ప్రక్రియను ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. రూసా పథకంలో భాగంగా రూ.23 లక్షలతో తొలిదశ పనులను పూర్తి చేశారు. ముందుగా తాళపత్రాలను ప్రత్యేకమైన రసాయనాల సహాయంతో శుభ్రపరిచి స్కానింగ్ చేశారు. అనంతరం వాటిని తిరిగి ప్రత్యేకమైన వస్త్రంతో చుట్టి భద్రపరిచారు. తొలిదశలో డిజిటలైజేషన్ చేసిన తాళపత్రాలను ప్రజల అందుబాటులో ఉంచేలా అధికారులు చర్యలు చేపట్టారు.

వెబ్‌సైట్‌లో లాగిన్ అయితే చాలు

ఆంధ్ర విశ్వ విద్యాలయం వెబ్‌సైట్‌లో www.andhrauniversity.edu.inకి వెళితే మనకి లైబ్రరీ అనే కాలమ్ కనిపిస్తుంది. దీనిని క్లిక్ చేసి తాళపత్రాలకు సంబంధించిన సమాచారాన్ని పొందవచ్చు. ప్రతి వ్యక్తి ముందుగా తమ ఈ–మెయిల్ నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తమ ఈ మెయిల్ ఐడీ సహాయంతో ఒక పాస్‌వర్డ్‌ని రూపొందించుకోవాల్సి ఉంటుంది. మన ఈ మెయిల్, పాస్‌వర్డ్ ఉపయోగించి డిజిటలైజేషన్ చేసిన తాళపత్రాలను ప్రత్యక్షంగా చూడటం, చదవడం చేయవచ్చు.

విభిన్న భాషల్లో తాళపత్రాలు

ప్రస్తుతం డిజిటలైజ్ చేసిన తాళపత్రాలలో తెలుగు, సంస్కృతం, బెంగాలీ, తమిళం, దేవనాగరి తదితర భాషల్లో రాసినవి ఉన్నాయి. ఒక్కో గ్రంథంలో ఎన్ని తాళపత్రాలు ఉన్నాయి, ఒక్కో తాళపత్రం ఎన్ని లైన్లలో రాశారు, ఒక్కో లైన్‌లో ఎన్ని పదాలు ఉన్నాయి అనే సమస్త సమాచారం ఇక్కడ మనకు లభిస్తుంది. వీటిలో ఆయుర్వేదం, జ్యోతిష్యం, పురాణాలు, ఇతిహాసాలు, తర్క, తంత్ర శాస్త్రాలు, ధర్మశాస్త్రం, గద్యకావ్యాలు, అలంకారశాస్త్రం, గణితం, కావ్య, యోగ, వేదాంతం, వేదం, ఉపనిషత్‌లు, ఆగమ శాస్త్రం, శతకాలు, పూజలకు సంబంధించినవి ఉన్నాయి.

అందరూ ఉపయోగించుకోవాలి..

దశాబ్దాల క్రితం రాసినవి కావడంతో వీటిని భద్రపరచడం పెద్ద సవాలుగా నిలిచింది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్టును నిర్వహించారు. ప్రాచీన విజ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో తాళపత్రాల డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రారంభించి, విజయవంతంగా పూర్తి చేశారు. ఇటీవల ఏయూలో జరిగిన సౌత్ ఇండియా విశ్వవిద్యాలయ ఉపకులపతుల సమావేశంలో నాటి రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా దీనిని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.



కంప్యూటర్‌లో సులభంగా చదివే విధంగా తాళపత్రాలు

పరిశోధకులు, చరిత్రకారులకు ఉపయుక్తంగా..



తాళపత్రాలపై పరిశోధనలు జరిపే వారికి, చరిత్రకారులకు వీటిపై ఆసక్తి ఉంటుంది. అటువంటి వారు ఉపయోగించుకోవాలనే మంచి సంకల్పంతో దీనిని అందరికీ అందుబాటులో ఉంచారు. కేవలం ఈ మెయిల్‌తో రిజిస్ట్రేషన్ చేసుకుని డిజిటలైజ్ చేసిన తాళపత్రాలలో సమాచారాన్ని పూర్తిగా చదివే అవకాశం కల్పిస్తున్నాం.

–ఆచార్య పి.వెంకటేశ్వర్లు, డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాలయాధికారి

మహారాజా బ్యాంక్ నూతన శాఖ ప్రారంభం



బ్యాంక్‌ని ప్రారంభిస్తున్న అశోక్‌గజపతిరాజు, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: సుజాతనగర్‌లో మహారాజా కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ 6వ శాఖను కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదివారం ప్రారంభించారు. వేపగుంట, పాపయ్యరాజుపాలెం, పురుషోత్తపురం, చినముషిడివాడ, సుజాతనగర్, పెందుర్తి ప్రజలకు అందుబాటులో బ్యాంక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు బ్యాంక్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రామకృష్ణంరాజు తెలిపారు. ఏటీఎం సదుపాయం కూడా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. బ్యాంక్‌లో నూతనంగా యువ డిపాజిట్ పథకం 25 సంవత్సరాల లోపు వారి కోసం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా సీనియర్ సిటిజన్స్‌కి ఇచ్చే ప్రాధాన్యత, అధిక వడ్డీ 0.50 శాతం యువ డిపాజిట్‌దారులకు కూడా లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కె.కె.రాజు, జిల్లా సహకార అధికారి ఎస్.డి.మిల్టన్, విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ గౌరవ అధ్యక్షుడు మానం ఆంజనేయులు, పైడా విద్యా సంస్థల అధ్యక్షుడు పైడా కృష్ణ ప్రసాద్, విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు, హిందూస్థాన్ షిప్‌యార్డ్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, రిటైర్డ్ పీఎఫ్ కమిషనర్ ఎస్.వి.ఎస్.ఎస్.రామచంద్రరాజు, కార్పొరేటర్లు ముమ్మన దేముడు, శానాపతి వసంత, పీలా శ్రీను, బల్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి ఎర్నిమాంబ జాతర



కంచరపాలెం: జ్ఞానాపురంలో కొలువైన ఎర్నిమాంబ అమ్మవారి జాతర ఈ నెల 20 నుంచి నిర్వహించేందుకు దేవదాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుతం ఆలయాన్ని సుందరంగా అలంకరిస్తున్నారు. తాటాకులతో పందిళ్లు వేస్తున్నారు. 20వ తేదీ శనివారం తొలేళ్ల సంబరం, 21న ఆదివారం ప్రధాన జాతర, 27న భారీ అన్నసమారాధన జరగనుంది. అమ్మవారి ఘటాలు తీసుకునే భక్తులు ముందుగా ఉత్సవ కమిటీ సభ్యులను సంప్రదించాలని ఈవో బాబా సూచించారు.



బొర్రా గుహలలో పర్యాటకులు

బొర్రాకు పర్యాటకుల తాకిడి

అనంతగిరి : మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలకు పర్యాటకులు తాకిడి పెరిగింది. వేసవి సెలవులు నేపథ్యంలో రెండు వారాలుగా పర్యాటకుల సంఖ్య అంతంతమాత్రంగా ఉండేది. ఆదివారం మాత్రం పర్యాటకుల తాకిడి పెరిగింది. గుహలను 2,200 మంది తిలకించారు. సుమారు రూ.2 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	475.00
విజయనగరం	479.00
శ్రీకాకుళం	479.00

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.120
స్కిన్	: రూ.250
స్కిన్‌లెస్	: రూ.260

కొలువుదీరిన మోదమ్మ



అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు, ఇత్తడి ఘటాలు మోస్తున్న జిల్లా కలెక్టర్



పూజలు చేస్తున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు

సాక్షి,పాడేరు : మన్యం ప్రజలు ప్రజల ఆరాధ్య దైవం, చల్లని తల్లి పాడేరు మోదకొండమ్మతల్లి ఉత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం వేకువ జామునే ఆలయ కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నర్సింగరావు దంపతులతో పాటు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు, సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి, ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వర్తన పిన్నయ్యదొర, నవర కొండబాబు, తమర్బ ప్రసాద్‌నాయుడు తదితరులు సతకంపట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి కాలినడకన మోదకొండమ్మతల్లి ఆలయానికి ఎమ్మెల్యే దంపతులు, భక్తులు చేరుకుని పూజాసామగ్రి పంపిణీ చేశారు. ప్రభుత్వం తరపున కలెక్టర్ సుమిత్‌కుమార్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.అనంతరం మోదకొండమ్మతల్లి మూలవిరాట్‌తో పాటు ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.

సతకంపట్టు వద్ద..

మోదకొండమ్మతల్లి మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా పాదాలు, ఉత్సవ విగ్రహం, ఇతర ఘటాలను మెయిన్‌రోడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సతకంపట్టు మండపంలో కొలువుదీర్చారు. ఉత్సవాలు ప్రారంభంతో ఆదివారం ఉదయం నుంచి పాడేరు పట్టణంలో సందడి నెలకొంది. ఆలయంలో అమ్మవారికి కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు, ఇతర ఇత్తడి ఘటాలకు కుంకుమార్చన నిర్వహించారు.

విగ్రహాలను మోసేందుకు..

ఊరేగింపులో ఉత్సవ విగ్రహాన్ని ఎస్పీ తుహిన్‌సిన్హా, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ మోశారు. ఉదయం 5గంటల నుంచి 9గంటల వరకు ఘటాల ఊరేగింపులో గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయులు, గిరిజనేతరులు, వర్తకులు, పలు రాజకీయ పార్టీల నేతలు, అన్ని వర్గాల భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, కలెక్టర్ సుమిత్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఐటీడీఏ పీవో అభిషేక్, పాడేరు మేజర్ పంచాయతీ సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి సతకంపట్టు వద్ద ఉత్సవాలను ప్రారంభించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

గిరిజన సంప్రదాయ కొమ్ము, థింసా నృత్యాలు, గరగల డప్పులు, నృత్యాలు, కేరళకు చెందిన వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. కలెక్టర్ సుమిత్‌కుమార్ గిరిజనుల సంప్రదాయ కొమ్మును ధరించారు.